
సాక్షి ప్రకాశం

బుధవారం। 8। జనవరి। 2025



లక్ష్యం మేరకు రుణాలివ్వండి

ఓజీఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం కింద బ్యాంకులకు కేటాయించిన లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. - IIలో..



బస్సు చక్రాల కింద బలైన వృద్ధుడు

ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో యాచకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన ఒంగోలు ఆర్టీసీ బస్టాండులో మంగళవారం ఉదయం జరిగింది. - IIలో..

గరిష్టం/కనిష్టం
30/20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రివేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్టీ సెల్ అధ్యక్షునిగా పటాలవత్ రాములు నాయక్, వలంటీర్ వింగ్ అధ్యక్షునిగా ఎస్కే.నాయబ్ రసూల్, సోషల్‌మీడియా వింగ్ అధ్యక్షునిగా వెన్నా శివక్రిష్టారెడ్డి, స్టూడెంట్ వింగ్ అధ్యక్షునిగా పల్నాటి రవీంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ వింగ్ అధ్యక్షునిగా మంగమూరి శ్రీనివాసులు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షులుగా కనపర్తి గోవిందమ్మ లను నియమించినట్లు తెలిపారు.

ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ బదిలీ

- కొత్తగా ఎస్ జాన్సన్ నియామకం

ఒంగోలు అర్బన్: ప్రభుత్వం మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు జిల్లాలో ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా ఉన్న వీఎస్ లోకేశ్వరరావును అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేయగా ఆయన స్థానంలో పదోన్నతిపై ఎస్ జాన్సన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సీ కులగణనపై అభ్యంతరాల స్వీకరణ గడువు పెంపు

ఒంగోలు అర్బన్: ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారంతో గడువు ముగియనుండటంతో మరో 5 రోజుల పొడిగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఎస్‌ఓపీ విధి విధానాలతో ప్రభుత్వం 265 జీవోను విడుదల చేసినట్లు తెలిపారు. ఆ మేరకు ఈ నెల 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఈ నెల 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం తనిఖీలు పూర్తి చేసి తుది సర్వే వివరాలను ఈనెల 20వ తేదీ గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వివరించారు.

పదో తరగతి స్టడీమెటీరియల్ ఆవిష్కరణ



పదో తరగతి స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న కలెక్టరు తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ఎస్‌సీఈఆర్టీ వారు రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్ ను స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. జిల్లా డీసీఈబీ ముద్రణ చేసి ప్రతి పాఠశాలకు ఉచితంగా రెండు కాపీలను సరఫరా చేస్తుందని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు చీమకుర్తి క్రీడాకారుడు

చీమకుర్తి: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ రెజ్లింగ్ పోటీలకు చీమకుర్తికి చెందిన క్రీడాకారుడు మేకల ఉమామహేశ్వరరావు ఎంపికైనట్లు కోచ్ కే.వెంకట్ మంగళవారం చీమకుర్తిలో తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలోని గురుకాశి యూనివర్శిటీలో ఈనెల 10 నుంచి 15 వరకు నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావును స్థానికులతో పాటు వారి కుటుంబ సభ్యులు అభినందించారు.



రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన మేకల ఉమామహేశ్వరరావు

పచ్చ సిరాతో ఎయిడెడ్ రాత!

“మీరేం ఇబ్బందిపడొద్దు.. అధికారంలోకి రాగానే ఎయిడెడ్ పాఠశాలలను ఆదుకుంటాం” అని సీఎం చంద్రబాబు హామీలు గుప్పించారు. తీరా గద్దెనెక్కాక ఎప్పటిలాగే నాలుక మడతేశారు. వీటి ఊపిరి తీసే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యా రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఇవ్వగా.. అవన్నీ కూటమి ప్రభుత్వంలో కనుమరుగయ్యాయి. తాజాగా ఎయిడెడ్ పాఠశాలలపై కూటమి సర్కారు కత్తిగట్టింది. మొత్తం స్కూళ్లను ప్రైవేటుపరం చేసి కార్పొరేట్లకు దాసోహమయ్యేలా చేస్తోంది.

- అధికారంలోకి రాగానే ఎయిడెడ్ స్కూళ్లను ఆదుకుంటామని హామీ
- గద్దెనెక్కాక మూసివేత దిశగా కూటమి పాలకుల అడుగులు
- టీచర్ల సర్దుబాటుపై విద్యాశాఖాధికారుల కప్పదాటు
- ప్రభుత్వ చర్యలతో లబోదిబోమంటున్న ఎయిడెడ్ యాజమాన్యాలు
- పోస్టుల విక్రయం, ఎక్కువ హాజరు నమోదుపై ఆరోపణలు



పుల్లలచెరువు మండలంలోని మానేపల్లి గ్రామంలోని ఉమామహేశ్వర ఎయిడెడ్ యూపీ పాఠశాల

ఒంగోలు సిటీ: బాలబాలికలు బడి బయట ఉండకుండా అందరూ చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రైవేట్‌తో పాటు ఎయిడెడ్ పాఠశాలలకు ప్రభుత్వాలు అనుమతి ఇచ్చాయి. కొన్ని దశాబ్దాలపాటు ఇవి ఒక వెలుగు వెలిగాయి. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా నడిచాయి. కొన్ని పాఠశాలల యజమాన్యాల అక్రమాలతో ఇది పక్కదోవ పట్టింది. దీనికి తోడు గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఈ వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలల విలీనానికి అవకాశం కల్పించింది. కొంత మంది కలసిరాగా, మరికొంత మంది కోర్టులకెక్కారు. అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలపై టీడీపీ నేతలు, ఎల్లో మీడియా అసత్య ప్రచారానికి పూనుకున్నారు. తాము అధికారంలోకి వస్తే వీటిని ఆదుకుంటామంటూ చంద్రబాబు ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు మండిపడుతున్నారు. అధికారులు సైతం వీటి పట్ల అడుగడుగునా నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

13 పాఠశాలల్లో విద్యార్థులు నిల్

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 13 ఎయిడెడ్ పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదైనట్లు అధికారులు ఇటీవల తేల్చారు. ఈ పాఠశాలల్లో 47 మంది టీచర్లు పని చేస్తున్నారు. వీరు కాక మరో 50 మంది వెరసి మొత్తం 97 మంది మిగులు ఉన్నారు. నిబంధనల ప్రకారం పాఠశాలల్లో పిల్లలు లేకపోతే వాటిని తాత్కాలికంగా మూసివేసి అక్కడ పనిచేసే టీచర్లను పిల్లలు ఉన్న స్కూళ్లకు సర్దుబాటు చేయాలి. అయితే విద్యాశాఖాధికారులు ఆ పనిచేయకపోవడంతో టీచర్లు ఖాళీగా ఉంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఖాళీగా కూర్చుంటున్న టీచర్లకు ప్రభుత్వం సుమారు కోటి రూపాయలకు పైగా వేతన రూపంలో చెల్లిస్తోంది. కంభం, కొమరోలు, గిద్దలూరు మండలాల్లోని కొన్ని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

మామూళ్ల మత్తులో ఎంఈఓలు

అన్ని యాజమాన్యాల పాఠశాలలను పర్యవేక్షించాల్సిన ఎంఈఓలు కేవలం ప్రభుత్వ స్కూళ్ల తనిఖీలకు మాత్రమే పరిమితమవుతున్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉన్న విషయం తెలిసినా వాటి జోలికి వెళ్లకుండా చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్ని ఎయిడెడ్ స్కూళ్ల యాజమాన్యాలతో ఎంఈఓలు కుమ్మక్కై చర్యలకు వెనుకాడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా 25 ఎయిడెడ్ పాఠశాలల్లో ఒక్కో టీచర్ మాత్రమే పనిచేస్తున్నారు. అత్యవసర సమయాల్లో టీచర్ సెలవు పెడితే మరో స్కూల్ టీచర్ లేదా సీఆర్పీని డిప్యుటేషన్‌పై పంపించాలి. అయితే సెలవు కావాలని కోరిన సింగిల్ టీచర్లకు ‘మీరే ఎవరినైనా చూసుకోండి. మా సీఆర్పీలకు పనులుంటాయి’ అని ఎంఈఓలు సమాధానం చెబుతుండటం చర్చనీయాంశమైంది. ప్రతి మండలంలో నలుగురు లేదా ఐదుగురు సీఆర్పీలు ఉన్నప్పటికీ ఎయిడెడ్ టీచర్లకు సెలవు మంజూరు చేయకుండా ఎంఈఓలు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గత ప్రభుత్వం విలీనానికి అవకాశమిచ్చినా..

ఎయిడెడ్ పాఠశాలల్లో నెలకొన్న పరిస్థితులను గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అటు యాజమాన్యాలు, పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి మేలు చేసేలా విలీనానికి అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియ అంతా యాజమాన్యాల అంగీకారం ద్వారానే చేసింది. విలీనానికి కొంతమంది యాజమాన్యాలు అంగీకరించగా, కొందరు యాజమాన్యాలు మాత్రం పిల్లలు లేకపోయినా తమ ఆస్తులు పోతాయని అంగీకరించలేదు. దీంతో క్రమక్రమంగా స్కూళ్లలో పిల్లల అడ్మిషన్ల ప్రక్రియ తగ్గిపోయింది. దీనికి యాజమాన్యాల నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు ఉన్నాయి.

ఉమ్మడి ప్రకాశంలో ఎయిడెడ్ స్కూళ్ల వివరాలు ఇలా..

ఉన్నత పాఠశాలలు	38
ప్రాథమికోన్నత పాఠశాలలు	13
ప్రాథమిక పాఠశాలలు	81
ప్రాథమిక, ప్రాథమికోన్నత స్కూళ్లలో టీచర్లు	317
హైస్కూల్ ఉపాధ్యాయులు	299
మిగులు ఉపాధ్యాయులు	97
మొత్తం విద్యార్థులు	23,000



కంభం మండలంలోని శ్రీనివాస ఎయిడెడ్ పాఠశాల

సర్దుబాటుపై దాటవేత ధోరణి

కొన్ని స్కూళ్లలో పిల్లల నిష్పత్తి కంటే ప్రభుత్వ వేతనంతో పనిచేసే ఉపాధ్యాయుల నిష్పత్తే ఎక్కువగా ఉంది. జిల్లాలో ఎయిడెడ్ ప్రైమరీ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 132 ఉండగా, ఇందులో మొత్తం 616 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 23 వేల మంది పిల్లలు ఉన్నారు. జీరో ఎన్‌రోల్ నమోదైన స్కూళ్లలో 47 మంది టీచర్లు పనిచేస్తున్నారు. వీరు కాక మరో 50 మంది కలిపి మొత్తం 97 మంది మిగులు ఉపాధ్యాయులు ఉన్నారు. దొనకొండ మండలంలోని బాదాపురం ఎయిడెడ్ స్కూల్లో 20 మంది పిల్లలకుగాను ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం ఎయిడెడ్ హైస్కూల్లో 60 మంది విద్యార్థులకుగాను 17 మంది ఉపాధ్యాయులు, కనిగిరి మండలం ఎల్.ఎం.కె హైస్కూల్లో 50 మందికిగాను 16 మంది టీచర్లు పనిచేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ నివేదికల ద్వారా తెలుస్తోంది. అయితే విద్యార్థులు ఎక్కువగా ఉన్నచోట ఉపాధ్యాయులు లేని పరిస్థితి నెలకొంది. జెడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల స్కూళ్లలో సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు పని సర్దుబాటు జరిగినా, ఎయిడెడ్‌లో మాత్రం యాజమాన్యాలు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది.

సంక్రాంతికి 264 ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు

- డీపీటీవో బి.సుధాకర్ వెల్లడి



మాట్లాడుతున్న డీపీటీవో బి.సుధాకర్

ఒంగోలు టౌన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ 264 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి బి.సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆర్టీసీ డిపోలోని ఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలుగు వారి పెద్ద పండుగైన సంక్రాంతికి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర దూర ప్రాంతాల నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వస్తారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న 5 డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు చెప్పారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు ఇంద్ర ఏసీ, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి 242 బస్సు సర్వీసులు, బెంగళూరు నుంచి 12 , చెన్నై నుంచి 10 బస్సు సర్వీసులు నడుపుతారన్నారు. ఇందుకు మొత్తం కొత్త హయ్యర్ బస్సులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి డిపోలోను ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ముందుగా రిజర్వ్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ సదుపాయాన్ని కల్పించామని, ప్రత్యేక సర్వీసులన్నిటినీ సాధారణ చార్జీలతో బస్సులను నడుతున్నట్లు తెలిపారు. ఏపీ ఆర్టీసీ లైవ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ప్రయాణికులు తాము ప్రయాణించే బస్సును సర్వీస్ నంబర్ ఆధారంగా సులువుగా ట్రాక్ చేయవచ్చన్నారు. ఒకవేళ బస్సు మిస్సయినా డిపోలో ఉండే సిబ్బంది, అధికారులను సంప్రదిస్తే సమాచారం ఇచ్చేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం అదనంగా స్టాండ్ బై బస్సులను కూడా సిద్ధం చేసి ఉంచుతున్నట్లు చెప్పారు. ప్రైవేటు బస్సులపై తమకు ఎలాంటి అధికారం లేదన్నారు. సంక్రాంతి పండుగకు సుమారు అప్ అండ్ డౌన్ కలుపుకొని 500 బస్సు సర్వీసుల వరకు నడుపుతున్నారని, ఈ ఏడాది సుమారు 50 వేల మందికి పైగా పండుగకు రావచ్చని భావిస్తున్నామని తెలిపారు. సురక్షిత ప్రయాణం, సౌకర్యవంత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

డిపోల వారీగా బస్సు సర్వీసులు ఇలా...

తేదీ	ఒంగోలు డిపో	గిద్దలూరు	కనిగిరి	మార్కాపురం	పొదిలి
9	3 సూపర్ లగ్జరీ 4 అల్ట్రా డీలక్స్	3 అల్ట్రా డీలక్స్ 1 ఎక్స్‌ప్రెస్	3 సూపర్ లగ్జరీ 3 అల్ట్రా డీలక్స్	4 సూపర్ లగ్జరీ	2 సూపర్ లగ్జరీ 2 ఎక్స్‌ప్రెస్
10	3 ఇంద్ర ఏసీ 8 సూపర్ లగ్జరీ 6 అల్ట్రా డీలక్స్ 2 ఎక్స్‌ప్రెస్	2 సూపర్ లగ్జరీ 6 అల్ట్రా డీలక్స్ 5 ఎక్స్‌ప్రెస్	6 సూపర్ లగ్జరీ 7 అల్ట్రా డీలక్స్ 5 ఎక్స్‌ప్రెస్	6 సూపర్ లగ్జరీ 8 ఎక్స్‌ప్రెస్	5 సూపర్ లగ్జరీ 3 ఎక్స్‌ప్రెస్
11	3 ఇంద్ర ఏసీ 8 సూపర్ లగ్జరీ 6 అల్ట్రా డీలక్స్ 2 ఎక్స్‌ప్రెస్	2 సూపర్ లగ్జరీ 6 అల్ట్రా డీలక్స్ 3 ఎక్స్‌ప్రెస్	6 సూపర్ లగ్జరీ 7 అల్ట్రా డీలక్స్ 4 ఎక్స్‌ప్రెస్	6 సూపర్ లగ్జరీ 7 ఎక్స్‌ప్రెస్	5 సూపర్ లగ్జరీ 2 ఎక్స్‌ప్రెస్
12	3 ఇంద్ర ఏసీ 8 సూపర్ లగ్జరీ 6 అల్ట్రా డీలక్స్ 2 ఎక్స్‌ప్రెస్	2 సూపర్ లగ్జరీ 6 అల్ట్రా డీలక్స్ 5 ఎక్స్‌ప్రెస్	6 సూపర్ లగ్జరీ 7 అల్ట్రా డీలక్స్ 5 ఎక్స్‌ప్రెస్	6 సూపర్ లగ్జరీ 8 ఎక్స్‌ప్రెస్	5 సూపర్ లగ్జరీ 3 ఎక్స్‌ప్రెస్
13	2 సూపర్ లగ్జరీ	1 అల్ట్రా డీలక్స్	1 సూపర్ లగ్జరీ	-	1 సూపర్ లగ్జరీ

మెగా డీఎస్సీతో జిల్లాకు అన్యాయం

ఒంగోలు టౌన్: కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీతో జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, దీనిపై జిల్లాకు చెందిన అధికారపార్టీ ఎమ్మెల్యేలు స్పందించాల్సిన అవసరం ఉందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎల్బీజీ భవనంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీపై కాలయాపన చేయడం కూటమి ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఉద్యోగాల భర్తీ చేయకపోతే వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ విలయ తాండవం చేస్తుంటే పాలకులకు పట్టించుకునే తీరిక లేకుండా పోయిందని విమర్శించారు. డ్రగ్స్ నివారణపై మాటలు తప్ప చేతలు లేవని, ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా డ్రగ్స్ నివారణ కమిటీలు వేసి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనవరి 1వ తేదీ జాబ్ కేలండర్ విడుదల చేస్తామని నారా లోకేష్ చెప్పారని, ఇప్పుడు జనవరి కూడా వెళ్లిపోతుందని చెప్పారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ జిల్లాలో ఒక్క రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లోనే అన్నీ రకాల కేడర్ కలుపుకొని 649 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేయాలని, ఇతర శాఖలకు చెందిన ఖాళీ ఉద్యోగాలను కూడా భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ సంస్థ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు మాట్లాడుతూ జిల్లాలోని దొనకొండ పారిశ్రామిక కారిడార్, దర్శి డ్రైవింగ్ స్కూల్, చీమకుర్తి శిల్పారామం, కనిగిరి నిమ్జ్, ఏకే యూనివర్శిటీలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యువజన నాయకులు పి.కిరణ్, నరేంద్ర, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ఆధునిక పద్ధతులతో రైతులకు లాభాలు



రైతులు వెళుతున్న బస్సును జెండా ఊపి సాగనంపుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టరు తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: విజ్ఞానం పెంచుకొని ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా రైతులు మరింత లాభాలు పొందవచ్చని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న ఉద్యాన ఉత్సవం-2025 విజ్ఞాన యాత్రలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వెళుతున్న రైతుల బస్సును మంగళవారం రాత్రి ప్రకాశం భవనం వద్ద కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి సాగనంపారు. ఈ యాత్రలో మొత్తం 70 మంది రైతులు పాల్గొనేందుకు వెళ్లినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్‌తో పాటు జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, వ్యవసాయ శాఖాధికారి రమేష్, ఆత్మ పీడీ రామ్మోహన్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

కనిగిరి తహసీల్దార్ సస్పెన్షన్



కనిగిరి తహసీల్దార్ కార్యాలయం

- ఆర్ఐ, వీఆర్వోపై కూడా సస్పెన్షన్ వేటు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు (ఫైల్)



తహసీల్దార్ అశోక్ కుమార్‌రెడ్డి

కనిగిరిరూరల్: కనిగిరి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు నెలల క్రితం మండలంలోని పునుగోడుకు చెందిన వీ మహేష్, వారి కుటుంబ సభ్యులు వారసత్వ భూమి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేస్తున్నారు. ఆ క్రమంలో భూమి మ్యుటేషన్ చేసేందుకు రెవెన్యూ అధికారులు భారీగా లంచం డిమాండ్ చేసి, ఇబ్బందులు పెట్టారు. దీనిపై ఈనెల 4న పునుగోడులో జరిగిన రెవెన్యూ సదస్సులో భూమి మ్యుటేషన్ కోసం తన వద్ద భారీగా నగదు లంచంగా డిమాండ్ చేసి, తమ పట్ల దురుసుగా ప్రవర్తించారంటూ తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి, వీఆర్వో రాధ (ప్రస్తుతం వెలిగండ్ల మండలం మరపగుంట్ల వీఆర్వోగా పనిచేస్తోంది), ఆర్ఐ పురుషోత్తమ్ రెడ్డిలపై పునుగోడు రైతులు వీ మహేష్, కుటుంబ సభ్యులు లిఖిత పూర్వక ఫిర్యాదు చేయడమే కాక.. లంచం డిమాండ్ చేసినట్లు ఉన్న ఫోన్ రికార్డింగ్ ఆడియో సంభాషణను కలెక్టర్‌కు వినిపించారు. దీంతో ఆ ఆరోపణలపై కలెక్టర్ విచారణకు ఆదేశించి, ప్రత్యేక అధికారులను నియమించారు. భూమి మ్యుటేషన్ కోసం అర్జీదారుని నుంచి లంచం డిమాండ్ చేసినట్లు, అతని పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు విచారణ అధికారులు ప్రాథమిక నివేదికలో తేల్చి ఉన్నతాధికారులకు నివేదించారు.

ఆ నివేదిక ఆధారంగా తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలను సస్పెండ్ చేస్తూ మంగళవారం కలెక్టర్ ఉత్తర్వుల్వ జారీ చేశారు. వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు చెప్పారు.

11న ఏకపాత్రాభినయ పోటీలు

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో శనివారం నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి జాతీయ స్థాయి ఏకపాత్రాభినయ పోటీల కరపత్రాలను మంగళవారం ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కే.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమ వివరాలను జిల్లా రంగభూమి సంఘ ప్రతినిధులు తెలియజేశారు. 11వ తేదీ రెండో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జాతీయ స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు (వీరబాహుడు, దుర్యోధనుడు, హరిశ్చంద్ర) పాత్రలకు సంబంధించిన పోటీలు జరుగుతాయని, అనంతరం రాత్రి ఏడు గంటలకు బహుమతి ప్రదాన సభ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ సుబ్బయ్య, సభ్యురాలు ఏల్చూరి అనంతలక్ష్మి, శేషరత్నం, వాకా సంజీవరెడ్డి, దిగ్విజయ్, యం.వి.వి.పి.బాబు రావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రంగ భూమి కళాకారులు

వేతనమివ్వండి మహాప్రభో..



ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది

- 6 నెలలుగా జీతం లేదని కాంట్రాక్ట్ సిబ్బంది ధర్నా
- మర్రిపూడి మండలంలో 32 గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా

మర్రిపూడి: మండలంలో సీపీడబ్ల్యూ స్కీం పరిధిలో పనిచేస్తున్న 11 మంది కాంట్రాక్ట్ సిబ్బందికి గత 6 నెలలుగా వేతనం మంజూరు చేయకపోవడంతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. విధులు బహిష్కరించడంతో 32 గ్రామాలకు తాగునీటి సరఫరాను నిలిచిపోయింది. వేతనం ఇచ్చే వరకు తాగునీరు వదిలేది లేదని తెగేసి చెప్పారు. గతంలో పనిచేసిన కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని, ప్రస్తుత కాంట్రాక్టర్ తనకు సంబంధం లేదని అంటున్నారని సిబ్బంది వాపోయారు. జీతం ఇవ్వకుంటే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ జ్వాలా నరసింహారావు, ఎంపీడీఓ జగదీష్‌తోపాటు ఆర్‌డబ్ల్యూస్ ఏఈ జైపాల్‌కు వినతి పత్రాలను అందజేశారు. ధర్నాలో కాంట్రాక్ట్ సిబ్బంది పోతులూరయ్య, పి.రోశయ్య, పడిదపు శ్రీను, గౌరవరపు శ్రీను, పి.వెంకటేశ్వర్లు, తిరుమలరావు, టివెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కులపోడిననేగా వివక్ష

- కుళాయి కనెక్షన్ ఇవ్వకపోవడంపై గలిజేరుగుళ్ల ఎంపీటీసీ సురేష్ ఆవేదన
- సర్వ సభ్య సమావేశంలో నేలపై బైఠాయించి నిరసన

బేస్తవారిపేట: కుళాయి కనెక్షన్ ఇవ్వడంలో వివక్ష చూపడంపై బేస్తవారిపేట మండలం గలిజేరుగుళ్ల ఎంపీటీసీ సభ్యుడు కుంపటి సురేష్ నిరసన తెలిపారు. మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారుల ఎదుట నేలపై బైఠాయించి నిలదీశారు. ప్రజాప్రతినిధినైన తాను పలుమార్లు తమ ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని కోరినా పట్టించుకోవడం లేదని, పక్కన గృహాలకు ఇచ్చి తనకుఎందుకు ఇవ్వడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్, పంచాయతీ కార్యదర్శి ఆవులయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జలజీవన్ నిధులతో పనులు చేయకుండా ఫోర్జరీ సంతకాలతో పనులు నిలిపివేశారని ఆరోపించారు. ఎస్సీ కులంవాడిననే చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



నేలపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సురేష్

మొన్న హాంఫట్.. నేడు పర్‌ఫెక్ట్



ఆక్రమిత భూమిలో మొక్కలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

- టీడీపీ నేత ఆక్రమించిన 10 ఎకరాల భూమి స్వాధీనం
- మొక్కలు తొలగించి హెచ్చరిక బోర్డు పెట్టిన అధికారులు

తర్లుపాడు: మార్కాపురం–తర్లుపాడు సరిహద్దులోని గానుగపెంట గ్రామ సమీపంలో టీడీపీ నేతల ఆక్రమించిన 10 ఎకరాల పశువుల బీడు భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత భూకబ్జాకు పాల్పడిన వైనంపై 'రూ.2 కోట్ల భూమి హాంఫట్' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన రెండు కోట్ల భూమి హాంఫట్ కథనంపై తహసీల్దార్ విజయభాస్కర్ స్పందించారు. ఆక్రమిత ప్రాంతానికి సిబ్బందితో కలిసి వెళ్లి టీడీపీ నేత నాటిన మామిడి, కొబ్బరి మొక్కలను తొలగింపజేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

మంత్రి ఇలాకాలో 'ఆటగాళ్లు'

- పోలీసుల అదుపులో 17 మంది
- వారి నుంచి రూ.3,62,730 స్వాధీనం

టంగుటూరు: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీబీవీ స్వామి స్వగ్రామమైన టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం గ్రామ శివారులో విచ్చలవిడిగా జూద శిబిరం సాగుతోంది. మంగళవారం జోరుగా పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు ఉప్పందడంతో టంగుటూరు ఎస్సై నాగమల్లీశ్వరరావు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 17 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,62,730 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై చెప్పారు.

అగ్నివీర్-వాయు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సిటీ: భారత వాయుసేనలో అగ్నివీర్-వాయు ఉద్యోగ నియమాకాలకు అర్హులైన స్త్రీ, పురుషులు ఈ నెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సీఈఓ పి.శ్రీమన్నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ, డిప్లమో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, కంప్యూటర్ సైన్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌తో మూడేళ్ల డిప్లమో పూర్తి చేసినవారు, సైన్స్ కాకుండా ఇతర విభాగాల ఉద్యోగాలకు ఇంటర్మీడియెట్ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేశారు. 2005 జనవరి 1 నుంచి 2025 జూలై 1 మధ్య మధ్య జన్మించి ఉండాలని, పురుషులు కనీస ఎత్తు 152 సెంటీమీటర్లు, స్త్రీలు 150 సెంటీమీటర్లు, తగిన బరువు, గాలి పీల్చినపుడు ఛాతీ 5 సెంటీమీటర్లు వ్యాకోచం చెందాలని తెలిపారు. వివరాలకు https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై కొడవలితో దాడి

కొమరోలు: పొలం గట్టు విషయమై ఇద్దరి మధ్య తలెత్తిన వివాదం దాడికి పురిగొల్పింది. ఈ సంఘటన కొమరోలు మండలంలోని బసువపల్లె గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి, వెంకటకుమార్‌రెడ్డి మధ్య పొలం గట్టు విషయంలో రెండేళ్ల నుంచి వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో వెంకటరామిరెడ్డి సోమవారం పొలం వద్ద కాపలాకు వెళ్లి అక్కడే నిద్రిస్తున్న సమయంలో గుర్రాల వెంకటకుమార్‌రెడ్డి కొడవలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకటరామిరెడ్డిని స్థానికులు గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా తనకు ప్రాణహాని ఉందని గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వెంకటరామిరెడ్డి ఆరోపించారు. దాడి ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణ.. నారాయణ.. అవేం మాటలు!

- మార్కాపురం మున్సిపల్ కమిషనర్ వైఖరిపై వార్డు సచివాలయ ఉద్యోగుల ఆగ్రహం
- కమిషనర్ చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కమిషనర్ నారాయణరావు తమను అకారణంగా దూషిస్తున్నాడంటూ వార్డు సచివాలయ ఉద్యోగులు ఆగ్రహించారు. మంగళవారం కమిషనర్ చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వివరాలు.. మార్కాపురం మున్సిపాలిటీలో వార్డు సచివాలయం-9 శానిటేషన్ సెక్రటరీగా శ్రీకృష్ణ విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో భాగంగా శనివారం వార్డులోని చెరువు కట్ట వద్ద ఉన్న పేడ దిబ్బలను తొలగించాలని సదరు యజమానులకు సూచిస్తున్నారు. అదే సమయంలో వార్డులోకి వచ్చిన కమిషనర్ శానిటరీ సెక్రటరీని పిలిచి అతనిపై దుర్భాషలాడి దాడికి యత్నించినట్లు ఉద్యోగులు ఆరోపించారు. మానసిక ఆవేదనకు గురైన శ్రీకృష్ణ సోమవారం తన తోటి ఉద్యోగులకు విషయం చెప్పడంతో.. ఎన్‌జీవో నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్‌తో చర్చించి న్యాయం చేస్తామని చెప్పడంతో వెనుదిరిగారు. మంగవారం ఉదయం సచివాలయ ఉద్యోగులంతా కలిసి శ్రీకృష్ణకు సంఘీభావంగా కమిషనర్ చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కమిషనర్ తరచూ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో ఎన్‌జీవో నాయకులు శాస్త్రి, శ్రీనివాస్, విజయ తదితరులు కమిషనర్ నారాయణరావును కలిసి మాట్లాడారు. తన చాంబర్ నుంచి బయటకు వచ్చిన కమిషనర్ మాట్లాడుతూ.. తాను ఉద్దేశపూర్వకంగా దూషించలేదని, విధి నిర్వహణలో భాగంగానే మాట్లాడానని సర్ది చెప్పారు. దీంతో ఉద్యోగులు ఆందోళన విరమించారు.



కమిషనర్ చాంబర్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

లక్ష్యం మేరకు రుణాలివ్వండి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: బీసీ యాక్షన్ ప్లాన్ 2024–25 ఓబీఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం కింద బ్యాంకులకు కేటాయించిన లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. మంగళవారం ప్రకాశం భవనంలో వెనుకబడిన తరగతుల సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో బీసీ యాక్షన్‌ప్లాన్ స్వయం ఉపాధి పథకం అమలుపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి పథకంలో భాగంగా పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు జిల్లాకు 1195 యూనిట్లతోపాటు ఆర్థికంగా వెనుకబడిన కులాలకు(ఈడబ్ల్యూఎస్) సంబంధించి 483 యూనిట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువత జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు రూ.4 లక్షల సబ్సిడీ పోను బ్యాంకు రుణం రూ.4 లక్షలు ఇవ్వాలని చెప్పారు. బీసీ యాక్షన్ ప్లాన్ కింద 24, ఈడబ్ల్యూఎస్ కింద 85 జనరిక్ మెడికల్ షాపులు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా 13 బ్యాంకులకు బ్రాంచ్‌ల వారీగా నిర్దేశించిన రుణ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం రమేష్, వివిధ బ్యాంకుల ప్రతినిదులు పాల్గొన్నారు.

కాపు కాశారు.. కాజేశారు!

- బ్యాంకులో వృద్ధురాలి వద్ద రూ.22 వేలు అపహరించిన దొంగలు
- సీసీ కెమెరాలో నిక్షిప్తమైన చోరీ బాగోతం

కంభం: నగదు లెక్కించడంలో సాయం చేస్తున్నట్లు నటించిన దొంగ ఓ వృద్ధురాలిని మోసం చేసి ఉడాయించాడు. ఈ సంఘటన మంగళవారం కంభం ఎస్‌బీఐలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన ఇమాంబీ ఉదయం 11.30 గంటల సమయంలో నగదు తీసుకునేందుకు ఎస్‌బీఐ బ్రాంచ్‌కు వెళ్లింది. విత్ డ్రా చేసిన రూ.70 వేలలో కొంత మొత్తాన్ని పక్కకు తీసేందుకు అక్కడే కూర్చుని లెక్క పెట్టుకుంటోంది. అప్పటికే అక్కడ కాపు కాసిన ఇద్దరు యువకుల్లో ఒకడు డబ్బు లెక్కించడంలో సాయం చేస్తున్నట్లు నటించి, కొంత నగదు తీసుకుని చల్లగా జారుకున్నాడు. మరో కౌంటర్ వద్ద పని ముగించుకుని వచ్చిన ఆమె కోడలు నగదు తక్కువగా ఉన్నట్లు అనుమానించి లెక్కించగా రూ.22 వేలు మాయమయ్యాయి. ఇద్దరు యువకుల కదలికలు అనుమానాస్పదంగా ఉన్నట్లు బ్యాంకు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో కూడా పలుమార్లు కంభం ఎస్‌బీఐ వద్ద నగదు దొంగతనాలు, ద్విచక్రవాహనాలు అపహరణకు గురైన సంఘటనలు ఉన్నాయి.



నగదు పోగొట్టుకున్న వృద్ధురాలు ఇమాంబీ



సీసీ ఫుటేజీలో అనుమానితుల చిత్రాలు

మహిళ మెడలో గొలుసు చోరీ

చీమకుర్తి: వాకింగ్‌కు వెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని ఇద్దరు దుండగులు బలవంతంగా లాక్కెళ్లారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం చీమకుర్తి–కేవీ పాలెం రోడ్డులో గ్రానైట్ ఫ్యాక్టరీల సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. చీమకుర్తికి ఎం.శ్రీనివాసరావు భార్య డాక్టర్ సూచన మేరకు మట్టి రోడ్డులో వాకింగ్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో ఇద్దరు యువకులు ఆపి అత్యవసరంగా మాట్లాడాలని చెప్పి ఫోన్ తీసుకున్నారు. అక్కడే వేచిఉన్న ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని బైక్‌పై వేగంగా చీమకుర్తి బైపాస్ వైపు దూసుకెళ్లారు. మహిళ కేకలు వేయడంతో పక్కనే ఉన్న గొర్రెల కాపరులు అప్రమత్తమై వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. దాదాపు ఆరు సవర్ల బంగారు గొలుసు పోయిందని బాధితురాలి భర్త ఎం.శ్రీనివాసరావు చీమకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ ఘటన తెలియడంతో మహిళలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సంఘటనా స్థలాన్ని సీఐ ఎం.సుబ్బారావు పరిశీలించారు.

సొంతూరు వెళ్తే.. ఇంటిని ఊడ్చేశారు

- రూ.లక్ష నగదు, ఆభరణాలు చోరీ

పామూరు: ఓ వ్యక్తి ఇంటికి తాళం వేసి వ్యక్తిగత పనిపై స్వగ్రామానికి వెళ్లగా దొంగలు చేతివాటం చూపారు. ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండలంలోని గోపాలపురానికి చెందిన పాలపర్తి రాము కుటుంబం పామూరులోని అయ్యప్పనగర్‌లో నివాసం ఉంటోంది. కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళంవేసి సొంత ఊరికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి తాళం పగలగొట్టిన దొంగలు రూ.లక్ష నగదు, వెండి, బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు మంగళవారం క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు.

ఇక్కడ పోయాయ్.. అక్కడ దొరికాయ్!

- చోరీ నేపథ్యంలో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

కంభం: తాళం వేసిన ఇంట్లో చోరీ సంఘటన రెండు కుటుంబాల మధ్య వివాదానికి దారితీసింది. కంభం పంచాయతీ పరిధిలోని సాదుమియా వీధిలో ఉంటున్న బీబీజాన్ తన తల్లికి వైద్యం చేయించేందుకు మంగళవారం ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం తెరిచి ఉండటాన్ని గమనించింది. లోపలికి వెళ్లి చూడగా రెండు తులాల బంగారు నగలు, నగదు, ఒక సెల్ ఫోన్ కనిపించలేదు. సమీపంలో ఉన్న ఒకరిపై అనుమానం వచ్చి వారి ఇంట్లోకి వెళ్లి తనిఖీ చేయగా నగలు, నగదు దొరికినట్లు తెలిసింది. అనంతరం నగలు దొరికిన ఇంటికి చెందిన వారు, నగదు పోయిన కుటుంబ సభ్యుల మధ్య వాగ్వివాదం ఘర్షణకు దారి తీసింది. మున్నా అనే వ్యక్తికి చేయి విరిగింది. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వారు మార్కాపురానికి సిఫార్సు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీకృష్ణుడి సన్నిధిలో దోపిడీ

దొనకొండ: మండలంలోని పెద్దన్నపాలెం చెరువుకట్టపై శ్రీకృష్ణుడి ఆలయంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ ఇనుప గేట్ల తాళం పగలగొట్టిన లోనికి ప్రవేశించిన దొంగలు హుండీలోని కానుకలు దొంగిలించారు. అంతటితో ఆగకుండా గర్భగుడి వెనుక గదుల తాళాలు పగలగొట్టారు. అర కేజీ బరువున్న నాగమయ్య, వెండి పడగలు, దాదాపు 40 ఇత్తడి గంటలు, సీసీ కెమెరాలు, 22 బస్తాల బియ్యం.. వెరసి మొత్తం రూ.2 లక్షల విలువైన సామగ్రి దోపిడీ చేశారు. సంఘటనా స్థలాన్ని త్రిపురాంతకం సీఐ హసన్ పరిశీలించారు. ఆలయ నిర్వాహకులు బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.



దొంగలు పగలగొట్టిన బీరువా

బస్సు చక్రాల కింద బలైన వృద్ధుడు



సంఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో వృద్ధుడు

ఒంగోలు టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒక యాచకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. మద్దిపాడు మండలం కొలచనకోట గ్రామానికి చెందిన వెంకటరావు(65) గత కొంతకాలంగా ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో యాచిస్తూ బతుకుతున్నాడు. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో నరసరావుపేట డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు ఔట్ గేట్ నుంచి బయటకు వచ్చింది. టర్నింగ్ తీసుకునే సమయంలో పక్కనే ఉన్నవెంకటరావు బస్సు వెనక టైరు కింద పడిపోయాడు. దీంతో ఆయన రెండు కాళ్లు విరిగిపోయి తీవ్రంగా రక్తస్రావమైంది. స్థానికులు, పోలీసులు స్పందించి 108లో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మరణించాడు. ఆయన కుటుంబ వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ఈ ఘటనపై స్థానికులు మండిపడుతున్నారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వల్లే వృద్ధుడు మరణించాడని ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ఆర్టీసీ బస్టాండులోని ఔట్‌గేట్, ఇన్‌గేట్ వద్ద సెక్యూరిటీ గార్డులు ఉండాలి, కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో సెక్యూరిటీ గార్డులు సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- జేసీ అగ్రహారంలో ఏడుగురికి గాయాలు

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారం గ్రామంలో మంగళవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామానికి చెందిన సంతోష్ అనే బాలుడిని, తోట ఆదిలక్ష్మమ్మ, బ్రహ్మం, కామిరెడ్డి కోణారెడ్డి, మరో ముగ్గిరిపై దాడిచేసి గాయపరిచింది. బాధితులు పూసలపాడు, కంభం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరుగులుపెట్టారు. పిచ్చిపట్టిన రెండు కుక్కలు కనపడినవారిని కనపడినట్లు గాయపరుస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వీధికుక్కల బారి నుంచి రక్షణ కల్పించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సంతోష్ చేతులు, నడుముపై గాయపరిచిన కుక్క



చేతులు, కాళ్లపై గాయాలను చూపుతున్న ఆదిలక్ష్మమ్మ